స్టేడియంలో సౌకర్యాలు శూన్యం!

- టెక్కలి మినీ స్టేడియంలో కానరాని వసతులు
- అవస్థలతో వివిధ క్రీడల్లో సాధన చేస్తున్న క్రీడాకారులు

టెక్కలి:

డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉన్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం (మినీ స్టేడియం)లో మౌలిక వసతులు కానరావడం లేదు. దీంతో వివిధ క్రీడల్లో సాధన చేస్తున్న క్రీడాకారులు అవస్థలు పడుతున్నారు. సువిశాలమైన మైదానంలో మినీ స్టేడియం ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో మౌలిక వసతుల లేకపోవడం, నిర్వాహణ బాధ్యతల విషయంలో అధికారులు సక్రమంగా దృష్టి సారించకపోవడంతో వివిధ రకాల క్రీడా ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఇబ్బందులతో సాధన చేస్తున్నారు. మరో వైపు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్న పట్టణవాసులు సైతం అవస్థలు పడుతున్నారు.

కానరాని మౌలిక వసతులు

మినీ స్టేడియంలో రన్నింగ్ ట్రాక్ లేకపోవడం, జిమ్ నిర్వాహణ సక్రమంగా లేదు. మరుగుదొడ్లు మరమ్మతులకు గురి కావడం, మంచినీటి సదుపాయం, క్రికెట్ క్రీడాకారులకు సాధన చేసేందుకు సరైన పిచ్, లాంగ్ జంప్ పిట్, వివిధ రకాల క్రీడలు, అథ్లెటిక్ సాధన విషయంలో కోచ్‌లు, బాలికలకు ప్రత్యేకంగా వసతులు లేకపోవడం తదితర సమస్యలు వేధిస్తున్నాయి. టెక్కలి చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ స్టేడియంలో సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రతిభను వెలికితీసే విషయంలో అవస్థలు పడుతున్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న స్టేడియంలో మౌలిక వసతులు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారు.



మౌలిక వసతులకు నోచుకోని మినీ స్టేడియం మైదానం



సౌకర్యాల్లేని ఇండోర్ స్టేడియం



అవస్థలతో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

బాలికలకు ప్రత్యేక వసతులు కల్పించాలి



మినీ స్టేడియంలో బాలికలకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలి. ఇలాగైతే బాలికలు ఇక్కడ క్రీడా సాధన చేస్తారు. రన్నింగ్ ట్రాక్, లాంగ్ జంప్ పిట్ లేదు. దీంతో సొంతంగా ఏర్పాటు చేసుకుని సాధన చేయాల్సి వస్తోంది. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా వసతులు ఏర్పాటు చేయాలి.

–మౌనిక మిశ్రో, లాంగ్ జంప్ జాతీయ క్రీడాకారిణి, టెక్కలి

కోచ్‌లను నియమించాలి



ఎంతో మంది క్రీడాకారులకు ఆసరాగా ఉన్న మినీ స్టేడియంలో క్రీడా సాధన కోసం కోచ్‌లను నియమించాలి. ప్రస్తుతం ట్రాక్ మొత్తం కంకర ఉండడంతో సాధన చేయడానికి ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా అథ్లెటిక్ కోచ్‌లను నియమించాలి.

–బి.మహేష్, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ క్రీడాకారుడు, టెక్కలి

క్లుప్తంగా

ఘనంగా బిడిమి చండేశ్వరి సిరిమానోత్సవాలు



అమ్మవారి ఊరేగింపులో భక్తజనం

మందస: మండలంలోని బిడిమి గ్రామంలో బిడిమి చండేశ్వరి సంబర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి తిరువీధిలో భక్తులు ఘటాలతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి. మంగళవారంతో సిరిమానోత్సవాలు ముగిస్తాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

22న ఆలయ భూముల లీజుకు వేలం

మందస: మండలంలోని సాబకోట, సింగుపురంగ్రామాల్లో ఉన్న జగన్నాథస్వామి దేవస్థానానికి చెందిన భూములను లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 22న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఎండోమెంట్ అధికారి వాసుదేవురావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు రూ. ఐదు వందలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ప్రారంభమైన పైప్ లైన్ పనులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి గ్రామంలో ప్రజల అవసరాలకు, వారి దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ఇటీవల పాడైంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మరమ్మతులు చేస్తుంటే స్థానిక కూటమి నాయకుడు అడ్డుకున్నారు. దీనిపై 'తాగునీరు అడ్డగింత'శీర్షికతో ఈ నెల 11వ తేదీ సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ అంశం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి గ్రామస్తులు, అధికారులు తీసుకువెళ్లడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గ్రామ ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో సంబంధిత సిబ్బంది సోమవారం స్థానిక సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి నేతృత్వంలో పైప్‌లైన్ పనులు ప్రారంభించారు.

వేతన ఒప్పందాన్ని సవరించాలి



పీసీఎంఏ అధ్యక్షులు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక నాయకులు

కాశీబుగ్గ: జీడి కార్మికుల వేతనాలకు సంబంధించి రెండేళ్లకు ఒకసారి జరిగే వేతన ఒప్పందాన్ని ఈ ఏడాది 30 శాతానికి సవరించాలని క్యాష్యూ లేబర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు పలాస క్యాష్యూ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా శ్రీనివాస్‌ని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఒప్పందం ప్రకారం వేతన సవరణ కచ్చితంగా జరపాలని, కార్మికులు పొందే వేతనాలకు సంబంధం లేకుండా ప్రభుత్వ పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలు అమలు జరగాలని, ఈఎస్ఐ, పీఎఫ్ ప్రతి కార్మికుడుకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీడి పరిశ్రమలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్మిక నాయుకులు శిష్టు గోపి, అంబటి ఆనందరావు, నెయ్యల గణపతి, గజ్జి బాలయ్య, కోవిరి జగన్ పాల్గొన్నారు.

బీసీ మహిళపై పోలీసుల ప్రవర్తన అప్రజాస్వామికం



మాట్లాడుతున్న మోహన్‌రావు

టెక్కలి: బీసీ వర్గానికి చెందిన మహిళ, మాజీ మంత్రి విడుదల రజనిపై పోలీసుల ప్రవర్తించిన తీరు అన్యాయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, న్యాయవాది సింగుపురం మోహన్‌రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాధారణ మహిళలే కాకుండా మహిళా ప్రజాప్రతినిధులపై దాడులు హెచ్చు మీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు వారి వృత్తి ధర్మాన్ని మరచిపోయి మహిళలపై దురుసుగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి సంఘటనలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఒక వైపు ఎస్సీ వర్గానికి చెందిన మహిళ ప్రజాప్రతినిధులపై దాడులు చేయడం, మరో వైపు బీసీ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన తీరు అప్రజాస్వామ్యకంగా కనిపిస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళలకు ఎంతో గౌరవం ఇచ్చారని ఇప్పుడు అటువంటి పరిస్థితులు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళకు గాయాలు

కాశీబుగ్గ: బస్సు ఢీకొట్టిన ఘటనలో పలాస మండలం పెద్దనారాయణపురం గ్రామానికి చెందిన అంబల పార్వతి గాయపడింది. ఆదివారం సాయంత్రం కాశీబుగ్గ కేటీరోడ్డులో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయపడినట్టు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ చెప్పారు.

గణిత అవధానికి సన్మానం

సోంపేట: కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన గతణిత అవధాని మద్దు తిరుపతిరావు మాస్టారును మాజీ ఎమ్మెల్యే జి.శివాజీ సోంపేటలో సోమవారం దుశ్శాలవతో సత్కరించారు. తిరుపతిరావు గణిత ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైన సందర్భంగా ఆయనను అభినందించారు. ఈ ప్రాంతంలోని విద్యార్థులకు గణితంలో మెలుకవలు తెలియజేసి మేధావులుగా తీర్చిదిద్దాలన్నారు.



కంచిలి: గణిత అవధాని తిరుపతిరావును సత్కరిస్తున్న గ్రామస్తులు

కంచిలి: బూరగాం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, గణిత అవధాని మద్దు తిరుపతిరావును గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. తిరుపతిరావు విద్యార్థులకు గణితంలో చతుర్విధ ప్రక్రియలపైన పూర్తిస్థాయి అవగాహన కల్పించే గణిత ప్రాజెక్టుకు జాతీయస్థాయి గుర్తింపు వచ్చిన నేపథ్యంలో గ్రామస్తులు సత్కరించారు. అలాగే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు సాహుకారి మోహిత్, జిణగ అక్షయ, పొందర భవానీలను, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సంపాదించిన గేదెల శ్రావణిలకు నగదు బహుమతులను అందజేశారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు గ్రామంలో నాటుసారా ప్యాకెట్లతో వ్యక్తి పట్టుబడ్డారని ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సీఐ జి.వి.రమణ సోమవారం తెలిపారు. బూర్జపాడు గ్రామంలో సారా అమ్ముతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం దాడులు చేయగా శివంగి మాధవరావు అనే వ్యక్తి 12 లీటర్ల నాటు సారా ప్యాకెట్లతో పట్టుబడినట్టు చెప్పారు. సారాను స్వాధీనం చేసుకొని మాధవరావును అరెస్టు చేశామన్నారు.

వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ మీటరివ్వాలి

కంచిలి: పెద్దశ్రీరాంపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో 2013 సంవత్సరంలో అమెరికా తెలుగు సొసైటీ, ఉద్దానం ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో ప్రారంభించిన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణకు విద్యుత్ మీటరు మంజూరు చేయాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ బల్లెడ సుమన్‌లు కోరారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి మండల విద్యుత్‌శాఖ కార్యాలయానికి సోమవారం వెళ్లి కొత్త మీటరు కోసం దరఖాస్తు చేశారు. పది రోజులుగా ఈ వాటర్‌ప్లాంట్‌కు ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించడంతో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యను దృష్టిలో పెట్టుకొని కొత్త విద్యుత్ మీటరు కేటాయించాలని కోరారు. ఏఈని కలిసిన వారిలో తలగాన తిరుపతి, తలగాన భాస్కరరావు, బల్లెడ సునీల్, మాదిన క్రాంతి పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖ కార్యాలయానికి వచ్చిన ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

మాతృమూర్తులకు రక్షణ కరువు



కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వ పాలనలో మాతృమూర్తులకు రక్షణ లేకుండా పోయిందని, మహిళలపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. సోమవారం పలాసలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఒక పక్క యుద్ధ వాతావరణం నెలకుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై కేసులు పెట్టి అరెస్టు చేయడానికి అత్యుత్సాహం చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర మాజీ మహిళా మంత్రి విడదల రజనీపై పోలీసులు చేసిన దాష్టీకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారాయుడిపై పోలీస్ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓ దళిత మహిళను వేకువ జామున నిబంధనలకు విరుద్ధంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.

ఘనంగా బైరవిమాత ఉత్సవం



గ్రామదేవత ఊరేగింపులో ఎమ్మెల్సీ రామారావు తదితరులు

సోంపేట: కర్తలిపాలెం గ్రామంలో బైరవిమాత గ్రామదేవత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం జరిగిన వేడుకల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొని గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎంపీటీసీ సభ్యుడు మంగి గణపతి, సర్పంచ్ పొందూరు గున్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని మందస గ్రంథాలయాధికారిని జె.విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు ఖోఖో, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు టి.జయరాం ఇంగ్లిష్ భాషపై పట్టు ఎలా సాధించాలో వివరించారు.

–మందస

పీహెచ్‌సీ సందర్శన



నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రోజువారీ రోగుల వివరాలు, సిబ్బంది హాజరు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు తదితర రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగుల వివరాలు ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కె.అనిత, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

–నందిగాం

నవధాన్యాల సాగుపై అవగాహన



నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతోందని సోంపేట మండల వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి అన్నారు. నవధాన్యాల సాగు–నేల తల్లిబాగు కార్యక్రమంలో భాగంగా బెంకిలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్యాల కిట్లను తయారు చేసి సోమవారం రైతులకు అందజేశారు. నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి కుమారి, సిబ్బంది మౌనిక, తులసయ్య, కామరాజు, కృష్ణవేణి, సుజాత, వీవోఏ సరస్వతి పాల్గొన్నారు.

–సోంపేట

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్



సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఘోరంగా వైఫల్యం చెందిందని.. ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు బాధ్యతగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాది పాలనలో దేశానికే తలమానికంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం కక్ష సాధింపు చర్యలు, గత ప్రభుత్వంలో అందజేసిన సంక్షేమ పథకాల కోత, మైనింగ్ మాఫీయాలు, అక్రమ కేసుల బనాయింపులతో ఏడాది కాలం గడిపేశారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు పథకాలు లేకపోగా తిరిగి నిత్యవసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలను అమాంతం పెంచేసి ప్రజలపై కోలుకోలేని ఆర్థిక భారం వేస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒడిశా నుంచి అక్రమంగా మద్యాన్ని తరలించి ఇషారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చేస్తున్న కక్ష సాధింపు చర్యలపై ఎటువంటి భయాందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను బహిరంగంగా ప్రజలకు వివరించాలని తిలక్ కోరారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పి.వసంత్‌రెడ్డి, నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు హెచ్.వెంకటేశ్వరావు, ఎస్.హేమసుందర్‌రాజు, టి.ఫాల్గుణరావు, బి.మోహన్‌రెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు గొండు చాందిని, ఎం.ఈశ్వరమ్మ, ఎస్.సత్యం, ఎ.రాహుల్, జి.వి.రెడ్డి మాస్టార్, ఎం.గణపతిరావు, కె.జీవన్, చిన్ని జోగారావు, పి.మోహన్‌రావు, యు.తమ్మయ్య, ఆర్.జయమోహన్, ఎస్.వినోద్, బి.వెంకటరమణ, ఎన్.సత్యరాజ్, ఆర్.మురళీరెడ్డి, ఎస్.రామిరెడ్డి పాల్గొన్నారు.

గేటు వేస్తే నరకమే..!



రాత్రి వేళ గేటు వద్ద వాహనదారుల ఎదురుచూపులు

- కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద ప్రజల అవస్థలు

కాశీబుగ్గ:

కాశీబుగ్గ రైల్వేగేటు ప్రజలకు నరకాన్ని చూపిస్తోంది. ఒకసారి గేటు వేస్తే సుమారు అరగంట ఇరువైపులా వాహనాలు బారువుతీరాల్సిందే. ఈ సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు అన్నీఇన్నీకావు. రాత్రి సమయంలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. తాము అధికారంలోకి వస్తే ఫ్లైఓవర్‌పనులు పూర్తి చేసి.. గేటు కష్టాలను తీరుస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి నాయకులు ఆ తరువాత ఈ విషయాన్ని మర్చిపోయారు.

గేటు దాటాలంటే భయమే..

కాశీబుగ్గ ఎల్‌సీ గేటు దాటాలంటే ప్రజలకు నరకం కనిపిస్తుంది. ఈ ట్రాక్ మీదుగా అప్‌లైన్, డౌన్ లైన్‌లలో ప్రతీ అరగంటకు రెండు రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు సగటున 150 రైళ్లు ఈ మార్గంలో వెళ్తుంటాయి. ఇందులో స్టేషన్‌కు ఆనుకుని ఉండటంతో ఇంజన్‌లు మార్చినవి అందులోకి వస్తాయి. రాత్రి వేళల్లో ఒక్కోసారి జంబో గూడ్స్ రైళ్లు వచ్చినప్పుడు గేటును మరీ ఎక్కువ సమయం వేయాల్సి వస్తుంది. ఈ సమయంలో వాహనాలు ఇరువైపులా భారిగా నిలిచిపోతుంటాయి. అలాగే గేటు వేసే సమయంలో దాన్ని దాటాలనే క్రమంలో చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో చాలామంది నర్సిపురం గ్రామం మీదుగా తాళ్లభద్ర గేటుకు చేరుకుని అక్కడి నుంచి కాశీబుగ్గ పట్టణానికి వస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం గడుస్తున్నా ఇప్పటికీ కాశీబుగ్గ ఫ్లైఓవర్ వంతెనపై మాట్లాడటం లేదు. రూ. 46 కోట్ల ఫ్లైఓవర్ పనులు చేపడతామని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల ప్రకటించినా ఇంతవరకు టెండర్ పక్రియ కూడా జరగలేదు. దీంతో ప్రజలకు గేటు కష్టాలు ఎప్పుడు తీరుతాయో తెలియని పరిస్థితి నెలకుంది.



రైలు పట్టాల మధ్యలో ఆగిన రైలు ఇంజన్



చీకట్లో వాహనదారుల ఇక్కట్లు

హామీని నెరవేర్చుకోవాలి

తాము అధికారంలోకి వస్తే ఫ్లైఓవర్ పనులు పూర్తిచేసి రైల్వే కష్టాలు తీరుస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఫ్లైఓవర్ ఊసేలేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శ్రద్ధతో ఫ్లైఓవర్ పనులు సగం పూర్తి చేశారు. ఇంకో సగమే పనులు జరగాల్సి ఉండగా ఎన్నికలు సమీపించడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే వంతెన పనులు పూర్తి చేయాలి.

–శిష్టు గోపి, కాశీబుగ్గ

టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉంది

ఫ్లైఓవర్‌ను ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రైల్వేశాఖ స్వాధీనం చేసుకుంది. కాశీబుగ్గ ఎల్‌సీ గేటుఫ్లైఓవర్ వంతెన నిర్మాణం చేపట్టాల్సింది కేంద్ర ప్రభుత్వమే. మా చేతులో ఏమీలేదు. టెండర్ పక్రియ పూర్తి చేసి పనులు పూర్తి చేస్తారని భావిస్తున్నాను.

– విక్రమ్, ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ శాఖ, పలాస